సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 10 । ఆగస్టు । 2025



అంతా అవినీతిమయం

రెవెన్యూ, సర్వే శాఖల్లో అవినీతి పెరుగుతోంది. ఉద్యోగులు శైలి మార్చుకోవడం లేదు.


- 8లో



కాంప్లెక్స్ కిటకిట

జిల్లా కేంద్రంలోని కాంప్లెక్స్ కిటకిటలాడింది. జనం బారులు తీరి కనిపించారు.

- 8లో



అమ్మో రైలు

ఊసవానిపేట రైల్వేగేటు వద్ద ఓ గూడ్స్ రైలు భయపెట్టింది. గేటు వేయకముందే వచ్చేసింది.

- 8లో

న్యూస్‌రీల్

పలాసలో రేపు సీజీఆర్ఎఫ్ క్యాంపు కోర్టు

పలాస: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని శ్రీకాకుళం సర్కిల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11న సోమవారం కాశీబుగ్గ సెక్షన్ కార్యాలయంలో పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్)చైర్ పర్సన్ విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. పలాస డివిజన్ కాశీబుగ్గ సెక్షన్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే క్యాంపు కోర్టులో వినియోగదారులు పాల్గొనవచ్చన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసులో జాప్యాలు, పేరు మార్పిడి, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణతో పాటు సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.రాజబాబు, ఎస్.సుబ్బారావు, ఎస్.మురళీకృష్ణ తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు.

రైతులంటే ఎందుకంత చులకన..?



ఎరువుల కేటాయింపుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పోలినాయుడు

పొందూరు: వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు రైతులంటే ఎందుకంత చులకన అని పొందూరు మండలానికి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రశ్నించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ కిల్లి ఉషారాణి ఆధ్వర్యంలో మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఎరువులు, యూరియా కేటాయింపులపై సమావేశం వాడీవేడిగా జరిగింది. ఈ ఏడాది యూరియా, ఎరువుల కొరతతో రైతులు అల్లాడిపోతున్నారని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఏ మండలానికీ రాని ఎరువులు, యూరియా కొరత పొందూరు మండలానికి వచ్చిందని దీనికి జిల్లా యంత్రాంగం, వ్యవసాయాధికారులు, వ్యవసాయశాఖ మంత్రే కారణ మని పిల్లలవలస సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు, తుంగపేట సర్పంచ్ వేణుగోపాలరావులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికీ మండలంలో కొన్ని గ్రామాలకు యూరియా కేటాయింపులు జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పొందూరు మండలానికి ఎందుకు చాలీచాలని కేటాయింపులు చేశారని వ్యవసాయాధికారి శ్రీనివాసరావును ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అన్నారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటేష్, ఎంపీడీఓ మన్మథరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

'స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి'

ఎచ్చెర్ల: స్వామి నాథన్ సిఫార్సులను అమలు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ కోరారు. ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కొంగరాం గ్రామంలో స్వామినాథన్ శత జయంతి సభను శనివారం నిర్వహించారు. ముందుగా స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ రైతులను నట్టేట ముంచే విధానాలను అవలంబిస్తోందని దుయ్యబట్టారు. పంటలు పండే భూములను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతోందని అన్నారు. కార్యక్రమంలో నక్క లక్ష్మీనారాయణరావు, పి.రాము, ఎస్.చిరంజీవి, ఎస్.రంగారావు, పి.రాంబాబు, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఆటవిక న్యాయం





- కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో యువకుడిపై దాడి
- క్వారీ కార్యకలాపాలను అడ్డుకున్నాడనే అభియోగంతో లాఠీ దెబ్బలు
- 12 గంటల పాటు స్టేషన్‌లో ఉంచి చితకబాదిన పోలీసులు
- ప్రతాపం చూపించిన ఎస్ఐ అమీర్ ఆలీ
- తీవ్రగాయాలతో రిమ్స్‌లో చేరిన యువకుడు
- పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు

ఈయన పేరు గెల్లంకి వెంకటరమణ. కొత్తూరు మండలం శోభనాపురం గ్రామస్తుడు. శోభనాపురం కొండపై జరుగుతున్న క్వారీ పేలుళ్లతో పంట పొలాల్లోకి రాళ్లు వచ్చి ప్రమాదకర పరిస్థితులు తలెత్తుతున్నాయని క్వారీ నిర్వాహకులను అడిగాడని, వారితో గొడవ పడ్డాడని, ఆ సమయంలో పోలీసులతో తప్పుగా మాట్లాడాడని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఉదయం 10గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు చితకబాదారు. ఎస్ఐ ఆమీర్ ఆలీ అయితే మరింత ప్రతాపం చూపించారు. చూపించడానికి వీల్లేని భాగాలతో పాటు చేతులు, కాళ్లపై ఇష్టారీతిన కొట్టారు. ముఖంపై బూటు కాలుతో తన్నారు. ప్రస్తుతం అతను రిమ్స్‌లో చేరాడు. ప్రస్తుతం ఇక్కడే చికిత్స పొందుతున్నాడు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

పాతపట్నం నియోజకవర్గం మెళియాపుట్టి మండలం దీనబంధుపురం వీఆర్బీ గ్రానైట్ క్వారీలో ఈ ఏడాది మే 17న భారీ పేలుడు సంభవించి ముగ్గురు కార్మికులు మృతి చెందారు. పేలుడు కారణంగా కార్మికులు మృతి చెందారని బాధిత కుటుంబ సభ్యులు నిరసనకు కూడా దిగారు. ఇదే భయం కొత్తూరు మండలం శోభనాపురం గ్రామస్తులకు పట్టుకుంది. ఆ గ్రామ కొండపై ప్రమాదకరమైన పేలుళ్లతో క్వారీయింగ్ చేయడం వల్ల తమ పంట పొలాల్లోకి భారీగా రాళ్లు వస్తున్నాయని, ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వారిలో యువకుడైన వెంకటరమణ ప్రమాదకర పేలుళ్లు ఆపాలని క్వారీ వద్దకు వెళ్లి అడిగాడు. అక్కడ ఇరువర్గాల మధ్య వాగ్వాదం, ఘర్షణ చోటు చేసుకుంది. సీన్ కట్ చేస్తే మరుసటి రోజు పోలీసు స్టేషన్‌కు వ్యవహారం వెళ్లింది. ఎవరి ఒత్తిళ్లో తెలీదు గానీ ఆ యువకుడ్ని పోలీసు స్టేషన్‌కు పిలిచి చావగొట్టారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు విచక్షణా రహితంగా కొట్టారు.



వెంకటరమణ చేతిపై గాయాలు

పోలీసుల తీరు అమానుషం..

ఒక వ్యక్తి తప్పు చేస్తే, చేశాడని ఫిర్యాదులు వస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలి. అంతే తప్ప ఆ వ్యక్తిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి, రోజంతా కూర్చోబెట్టి చావ బాదడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. రక్షణ కల్పించాల్సిన పోలీసులే దండిస్తే ఇక బాధితులు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. చట్ట విరుద్ధంగా అక్కడ పోలీసు అధికారి వ్యవహరించారు. తీవ్రగాయాలతో కొత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకెళ్తే అక్కడ ఎమ్మెల్సీ నమోదు చేయలేదు. ఎవరి ఒత్తిళ్లో తెలీదు గానీ సరైన చికిత్స కూడా అందించలేదు. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో ఈ నెల 6వ తేదీన కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకొచ్చారు. తీవ్ర గాయాలతో ఉన్న బాధితుడు వెంకటరమణ పరిస్థితి ఇబ్బంది కరంగా ఉంది. పోలీసులు కొట్టిన దెబ్బలకు తన కిడ్నీ పాడయ్యే అవకాశం ఉందని భయపడుతున్నాడు. దీనికంటే చావడమే మేలు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

సీసీ ఫుటేజీ గుట్టు విప్పితేనే..

గ్రామానికి చెందిన యువకుడిని పోలీసు స్టేషన్‌కు పిలిచి సుమారు 12 గంటల పాటు చితక్కొట్టారని గ్రామస్తులు ఏకంగా పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. అతని సోదరుడు, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి స్టేషన్‌కు వెళ్లి వదిలేయాలని ప్రాధేయపడినా ఎస్ఐ వినకుండా పరుష పదజాలంతో మరింత రెచ్చిపోయాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఘటన జరిగి వారం రోజులు కావస్తున్నా ఇంతవరకు వెంకటరమణను కొట్టిన వారిపై చర్యలు తీసుకోలేదు. వాస్తవంగా, ఆ రోజు పోలీసు స్టేషన్‌లో ఏం జరిగిందో సీసీ కెమెరాల ఫుటేజీలో ఉంటుంది. ఆ దిశగా విచారణ చేసినట్టుగా కనబడటం లేదు.

ఎస్పీకి ఫిర్యాదు

ఎస్ఐ చేతిలో గాయపడిన వెంకటరమణ కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి జిల్లా ఎస్పీని కలిసి విషయాన్ని వివరించారు. ఎస్ఐ కొట్టడం వల్ల అయిన గాయాలకు సంబంధించిన ఫొటోలను కూడా చూపించారు. వాస్తవానికి ఆ ఫొటోలు చూడటానికి కూడా కష్టంగా ఉంటుంది. తనను తీవ్రంగా కొట్టి గాయపరిచిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని బాధితుడు వెంకటరమణ డిమాండ్ చేస్తున్నారు.

కింజరాపు వారి బంధు ప్రీతి



నిమ్మాడ సర్పంచ్ కింజరాపు సురేష్‌తో అచ్చెన్నాయుడు (ఫైల్)

- ఢిల్లీలో జరగనున్న స్వాతంత్య్ర వేడుకలకు నిమ్మాడ సర్పంచ్ కింజరాపు సురేష్ ఎంపిక
- ఈయన రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడుకు సొంత అన్న కొడుకు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు సొంత బాబాయ్ కొడుకు
- జిల్లాలో ఎంతో మంది ఆదర్శవంతులైన సర్పంచ్‌లను పక్కన పెట్టి మరీ ఎంపిక

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

వడ్డించేవాడు మనవాడైతే ఎక్కడ కూర్చున్నా అన్నీ వచ్చి చేరుతాయనే సామెత అందరికీ తెలిసిందే. అయితే ఆ కేటాయింపులో సైతం పూర్తిగా బంధు ప్రీతి చూపిస్తూ మిగిలిన వారిని పక్కన పెట్టేయడం కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడుకే చెల్లుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న స్వాతంత్య్ర వేడుకలకు జిల్లాలో కోటబొమ్మాళి మండలం నిమ్మాడ పంచాయతీ సర్పంచ్ కింజరాపు సురేష్‌ను ఎంపిక చేశారు. అయితే ఇందులో విషయం ఏముంది అనుకుంటున్నారా..? ఆయన రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడుకు సొంత అన్న కుమారుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు సొంత బాబాయ్ కుమారుడు. జిల్లాలో ఎంతో మంది ఆదర్శవంతంగా సేవలు అందజేసిన సర్పంచ్‌లు ఉన్నప్పటికీ కేవలం బంధుప్రీతిని చూపించుకుంటూ సొంత కుటుంబ సభ్యుడిని స్వాతంత్య్ర వేడుకలకు ఎంపిక చేయడంపై సొంత పార్టీకి చెందిన వారే విస్తుపోతున్నారు. అటు రాజకీయాల్లోనూ అవకాశం ఇవ్వకపోగా, కనీసం ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో సైతం ఇతరులకు అవకాశం ఇవ్వకపోవడంపై ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. గత ఏడాది ఇదే మాదిరిగా ఢిల్లీలో ఎర్రకోటలో జరిగిన స్వాతంత్య్ర వేడుకలకు కేంద్రమంత్రికి వరుసకు మామ, రాష్ట్ర మంత్రికి వరుసకు మేనత్త కొడుకైన దోమ మోహన్‌రావు, ఆయన భార్య పుణ్యవతిని ఆదర్శ రైతులుగా ఎంపిక చేసి అప్పట్లో విమర్శలపాలయ్యారు.

వేడుకల ఎంపిక సిఫార్సుల్లో పూర్తిగా పక్షపాతం..

ఢిల్లీలో జరగనున్న స్వాతంత్య్ర వేడుకలకు గ్రామ స్థాయిలో సర్పంచ్‌ల ఎంపిక విషయంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు పూర్తిగా పక్షపాత వైఖరి చూపించారు. వాస్తవంగా ప్రతి పంచాయతీలో అభివృద్ధికి సంబంధించి ఆయా సర్పంచ్‌లు చేసిన కృషి, నిధుల వినియోగంలో అభివృద్ధిని పరిగణనలోకి తీసుకుని వేడుకలకు సిఫార్సులు చేస్తారు. ఇక్కడ పూర్తిగా విరుద్ధమైన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో తమకు అడ్డే లేదన్న మాదిరిగా మిగిలిన నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే స్థాయి ప్రజాప్రతినిధులను పక్కన పెట్టి మరీ కింజరాపు కుటుంబం బంధు ప్రీతిని చూపించుకున్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఇదే సురేష్ పై పోటీకి సిద్ధమైన వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌తో పాటు కొంత మంది వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేసిన సంఘటనల్లో నిమ్మాడ సర్పంచ్ సురేష్ కీలకంగా వ్యవహరించారు. అలాంటి వ్యక్తికి అవార్డుకు ఎంపిక చేయడంపై విమర్శలు వస్తున్నాయి.



ఇదెక్కడి ఆదర్శం..?

గత ఏడాది స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు సొంత కుటుంబ సభ్యుడిని ఆదర్శ రైతుగా ఎంపిక చేసిన దానిపై సాక్షిలో వచ్చిన కథనం

'మిషన్ రీడబుల్ ఫార్మాట్‌లో ఓటరు లిస్టులను ప్రకటించాలి'

పలాస: మిషన్ రీడబుల్ ఫార్మాట్‌లో ఎలక్ట్రానిక్ ఓటర్ లిస్టులను ప్రకటించాలని సి.పి.ఐ.ఎం.ఎల్ లిబరేషన్ కార్యవర్గ సభ్యులు డి.హరనాథ్, ఎ.ఐ.కె.ఎం జిల్లా కౌన్సిల్ సభ్యులు మద్దిల రామారావు డిమాండ్ చేశారు. లిబరేషన్ కేంద్రకమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో వారు మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ రివిజన్ పేరుతో ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. వీటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈ నెల 9 నుంచి 11 వరకు నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అన్ని రాష్ట్రాల్లో మోదీ ప్రభుత్వం ఓట్ల తొలగింపునకు ప్రయత్నం చేస్తుందన్నారు. బీహార్ రాష్ట్రంలో 64 లక్షల ఓట్ల తొలగింపునకు శ్రీకారం చుట్టారని ఆరోపించారు. వీటికి అడ్డుకట్ట పడాలని డి.హరనాథ్, రామారావు డిమాండ్ చేశారు.

'అక్రమ బదిలీలను రద్దు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న పలు సంఘాల నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కేజీబీవీ ప్రిన్సిపాళ్ల అక్రమ బదిలీలను రద్దు చేయాలని, రాజకీయ జోక్యాన్ని నియంత్రించాలని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్–ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని కంచిలి, గార, పొందూరు కేజీబీవీ స్కూల్ ప్రిన్సిపాళ్లను ఎలాంటి విచారణ జరపకుండా, కేవలం స్థానిక ఎమ్మెల్యేల లేఖల ఆధారంగా బదిలీ చేయడం దారుణమన్నారు. బాధిత ప్రిన్సిపాల్స్‌లో ఒకరు అనేక సమస్యలపై పత్రాల రూపంలో ఏపీసీకి తెలియజేసినా, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోకుండా, సమస్యలు ప్రస్తావించిన మహిళా ప్రిన్సిపల్‌ను బదిలీ చేయడం అన్యాయమన్నారు. మహిళా ఉద్యోగులపై స్థానిక రాజకీయ నాయకులు ఇష్టానుసారంగా దూషించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం, వేధింపులపై ఫిర్యాదు చేయడం మాత్రమే కాకుండా, ఆ వేధింపులకు సంబంధించిన ఫోన్ ఆడియో రికార్డింగ్స్‌ను కూడా ఏపీసీకి అందజేసినా, సంబంధిత వ్యక్తులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అత్యంత హేయమైన చర్య అన్నారు.

ఫిర్యాదు చేసిన మహిళా ప్రిన్సిపల్ పైనే చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు.

మన బంధం.. రక్షా బంధనం



జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న బెహరా మనోవికాస కేంద్రంలోని విభిన్న ప్రతిభావంతులకు అక్కడున్న సిబ్బంది రాఖీలు కట్టారు. రక్షాబంధన్ సంప్రదాయం గురించి వారికి వివరించి స్వీట్లు తినిపించారు.

– శ్రీకాకుళం కల్చరల్

11న క్రీడా పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 11న జిల్లా స్థాయి క్రీడా పోటీలను నిర్వహించాలని నిర్ణయించినట్లు డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు పేర్కొన్నారు. శనివారం వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులతో కేఆర్ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో 10 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్, హాకీ, కబడ్డీ, కోకో, వాలీ బాల్, బాక్సింగ్, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు కోడి రామ్మూర్తి స్టేడియం కోచ్‌లను సంప్రదించాలని ఆయన సూచించారు. అలాగే 75 ఏళ్ల జిల్లా ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఈనెల 14న నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీఓ తెలిపారు. కబడ్డీ, వాలీబాల్‌కు నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పోటీలు జరగనుండగా, వివిధ గ్రామీణ క్రీడలైన కర్రసాము, సంగిడీలు, ముద్దార్, పిల్లిమొగ్గలు ఈవెంట్స్ జిల్లాస్థాయిలో కేఆర్ స్టేడియంలో జరుగుతాయని తెలిపారు. వివరాలకు 9949861168, 7032737001, 9182018180 నంబర్లను సంప్రదించాలని వెల్లడించారు.

ఉత్సవం అదిరె.. ఆదివాసీలను మరిచె



పాతపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

- ఉత్సాహంగా ఆదివాసీ దినోత్సవం
- ఉత్సవంలో గిరిజనులకు దక్కని ప్రాధాన్యం
- గిరిజన నేతలకు మాట్లాడడానికి ప్రాధాన్యత ఇవ్వలేదని వేదికపై నిలదీత

పాతపట్నం:

ముందు వరుసలో అంతా గిరిజనేతరులు.. ప్రసంగాలు, ప్రాధాన్యాలన్నీ అన్నీ వారికే.. ఆదివాసీల కోసం నిర్వహించిన ఉత్సవంలో వారికే ప్రాధాన్యం దక్కలేదు. పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలో శనివారం జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో గిరిజనుల కంటే గిరిజనేతరులకే ప్రాధాన్యం దక్కడం విశేషం. సభాధ్యక్షుడిగా పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వ్యవహరించారు. ఉత్సవంలో తమకు ప్రాధాన్యం లేదని గిరిజన నేతలు అక్కడే మండిపడ్డారు. వేదిక మీదనే ఎమ్మెల్యేను గిరిజన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు చౌదరి లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం రూ.1000 కోట్లు నిధులు మంజూరు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. పాతపట్నం మార్కెట్ యార్డు ఆవరణలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఎక్కువగా గిరిజనులు ఉన్న మెళియాపుట్టి మండలంలోని ఐటీడీఏ ఏర్పాటు ఫైనాన్స్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉండడం వల్ల ఆలస్యమతోందన్నారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కువగా గిరిజనులు ఉన్నారని, స్థానికంగా ఉపాధి కల్పించాలని, పాలిటెక్నికల్, ఐటీఐ కళాశాలలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో కొత్తగా 26 అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు కానున్నాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. గిరిజన విద్యార్థులకు నాలుగు పీఎం జన్‌ధన్ హాస్టళ్లను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో ఎంఎస్ఎంఈ పార్కు మంజూరైందని తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, పక్కన ఎమ్మెల్యేలు గోవిందరావు, రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఆకట్టుకున్న విన్యాసాలు

పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జాతీయ రహదారి మీదుగా అంతరాబ కూడలి, మార్కెట్, ఆస్పత్రి కూడలీ మీదుగా ర్యాలీ చేసుకుంటూ థింసా నృత్యం, మే మే మేక వంటి వేషధారణలు ప్రదర్శించారు. కోర్టు కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యేతో కలిసి గిరిజన నాయకులు వాబ యోగి, రామారావు, డోల్లు శ్రీను, ఆనందరావు పూలదండ వేసి నివాళులు అర్పించారు. పలు గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు థింసా నృత్యం, సవర డ్యాన్స్ వంటివి ప్రదర్శించారు. మార్కెట్ యార్డులో ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ తయారు చేసిన ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తు రథ చక్రం ఆకట్టుకుంది. కార్యక్రమంలో జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, ఐటీడీఏ డీడీ దొర, ఐటీడీఏ డీఈఈ శిమ్మన్న, గిరిజన నాయకులు వాబ యోగి, దాసుపురం రామారావు, డోల్లు శ్రీను, మల్లిపురం భాగ్యలక్ష్మి, చౌదరి లక్ష్మీనారాయణ, హరిపురం ఆనందరావు, బైరిసింగి లక్ష్మీ నారాయణ, సవర కుమార్, దుర్యోధన, అడవి రాముడు, జన్ని రామారావు, కృష్ణ, కోచ్చ శ్రీను, మండల అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



థింసా నృత్యం చేస్తున్న విద్యార్థినులు



కొమురం భీమ్ అంటూ గిరిజన చిన్నారులు

క్లుప్తంగా

నిరుపేదకు అండగా..



ఇంటిని కానుకగా ఇచ్చిన సంస్థ ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు: నందిగాం మండలం మర్లపాడుకు చెందిన నిరుపేద నందిపేట మహాలక్ష్మీకి పూండికి చెందిన స్ఫూర్తి సేవా సంస్థ అండగా నిలిచింది. ఇద్దరు ఆడపిల్లలతో నిలువ నీడ లేని ఆమెకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కెంగువ రాంబాబు, 25 మంది ప్రతినిధులు సహకారంతో రూ.3.70లక్షలు వెచ్చించి ఇంటిని నిర్మించారు. శనివారం గృహ ప్రవేశం చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పి.గోవిందరావు, బి.మన్మధరావు, ఉత్తరాల బాలరాజు, సైని హేమారావు, యువతర సేవా సమితి అధ్యక్షుడు చింత మురళి, గున్న వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డీకే స్మారక అవార్డు ప్రకటన

శ్రీకాకుళం: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ 67వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఇద్దరు జర్నలిస్టులను అవార్డులకు ఎంపిక చేశామని కమిటీ చైర్మన్ దుప్పల రవీంద్రబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్ర సీనియర్ జర్నలిస్ట్, ఉద్యమకారుడు దివంగత దుప్పల కృష్ణమూర్తి (డి.కె) స్మారక అవార్డుకు 'సాక్షి' దినపత్రిక శ్రీకాకుళం బ్యూరో చీఫ్ కందుల శివశంకర్‌ను ఎంపిక చేశామన్నారు. అలాగే జనదీపిక ఎడిటర్ సున్నం చిన్నారావును దివంగత శృంగారం ప్రసాద్ స్మారక అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వీరికి ఈ నెల 17వ తేదీన జరగనున్న ఏపీయూడబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు.

అంతా అవినీతిమయం!

- రెవెన్యూ, సర్వే శాఖల్లో పెచ్చుమీరిన లంచాలు
- కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మరింత దారుణం
- వ్యవహార శైలి మార్చుకోని కొందరు ఉద్యోగులు
- ఐవీఆర్ఎస్ ద్వారా బట్టబయలైన డొల్లతనం



శ్రీకాకుళం పాతబస్టాండ్:

కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో రెవెన్యూ, సర్వే శాఖల్లో అవినీతి తారస్థాయికి చేరిందా..? ప్రధానంగా కిందిస్థాయి ఉద్యోగుల్లో అధిక శాతం మంది లంచాలకు అలవాటుపడ్డారా..? అంటే అవుననే సమాధానం వినిపిస్తుంది. ఇందుకు ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం) ద్వారా చేయించిన సర్వేనే సాక్ష్యంగా నిలుస్తోంది. పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై ప్రభుత్వం నేరుగా ఫోన్ చేసి పీజీఆర్ఎస్ సర్వే ద్వారా ర్యాండమ్ సర్వే చేయిస్తుంది. సమస్య, పరిష్కారం తీరుతెన్నుల వివరాలు అడిగి తెలుసుకుంటారు. ఇందులో ప్రధానంగా అనినీతి, లంచగొండితనంపై ప్రశ్నలు వేస్తుంటారు. చాలా సమస్యలకు సంబంధించి ఫిర్యాదుదారు నుంచి క్షేత్రస్థాయి అధికారులు అంటే వీఆర్వో (గ్రామ రెవెన్యూ అధికారి), వీఎస్ (విలేజ్ సర్వేయర్) డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు ఐవీఆర్ఎస్ ద్వారా వెలుగుచూస్తున్నాయి.

లెక్క చేయడం లేదు..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులను కింది స్థాయి అధికారులు అంటే రెవెన్యూలో వీఆర్ఓ, విలేజ సర్వేయర్లు పూర్తిగా లెక్కచేయడం లేదు. ముఖ్యంగా అధికార పార్టీ నాయకుల సిఫారుసులతో తాము కోరుకున్న స్థానాల్లో విధుల్లోకి చేరిన వీరు ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు. ప్రతి నెలా ఆర్‌వోఆర్ సమావేశాలు నిర్వహిస్తున్నా కొందరు సిబ్బంది కనీస స్థాయిలోనూ స్పందించడం లేదని తెలుస్తోంది.

కానరాని చర్యలు..

జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌కు ఫిర్యాదు చేసిన వారికి సమస్య తీవ్రత బట్టి 15 రోజుల నుంచి 30 రోజుల్లోపు పరిష్కారం చూపాల్సి ఉంటుంది. అయితే చాలా వాటికి పరిష్కారంలో చొరవ చూపకుండా ఎండార్స్‌మెంట్‌కే ప్రాధాన్యమిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. జూలై 6 నుంచి ఆగస్టు 5 వరకు నెల రోజుల పాటు నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో చాలా అవినీతి ఘటనలు వెలుగులోకి వచ్చాయి. అయితే వీటిపై చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు.

- ఫిర్యాదుల పరిష్కారానికి గ్రామ రెవెన్యూ అధికారి డబ్బులు అడిగారని 64.19 శాతం మంది సర్వేలో వెల్లడించారు.
- ఫిర్యాదుపై సంతృప్తి చెందారా అనే ప్రశ్నకు 43.99 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. పాతపట్నం, పొందూరు, ఎచ్చెర్ల, కొత్తూరు, టెక్కలి, నందిగాం, హిరమండలం, కోటబొమ్మాళిలో ఈ అంశాన్ని ఐవీఆర్ఎస్ ద్వారా గుర్తించారు.
- భూముల సమస్యలకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండానే 50.65 శాతం సర్వే చేసినట్లు గుర్తించారు.
- జి.సిగడాం, గార, జలుమూరు, కంచిలి, కొటబొమ్మాళి, కొత్తూరు, ఎల్ఎన్‌పేట, సంతబొమ్మాళిలో 34.43 శాతం మంది సర్వేయర్లు ఎఫ్ లైన్ సమస్య పరిష్కారానికి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఐవీఆర్ఎస్ ద్వారా గుర్తించారు.
- జిల్లావ్యాప్తంగా ఐవీఆర్ఎస్‌పై అధికారుల్లో చర్చ జరుగుతోంది. ఈ రిపోర్టుపై వివరణ ఇచ్చేందుకు తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దార్లు మల్లగల్లాలు పడుతున్నారు.

ఎరువుల అక్రమ తరలింపుపై విచారణ చేపట్టాలి



విలేకరులతో మాట్లాడుతున్న చిరంజీవినాగ్

ఆమదాలవలస: కూటమి ప్రభుత్వ పాలనలో ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి రైతులను కష్టాల్లోకి నెడుతున్నారని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు. శనివారం ఆమదాలవలసలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు ఎరువుల కోసం రైతు భరోసా కేంద్రాల వద్ద క్యూలు కడుతున్నారని, కూటమి పాలనలో పలువురు నాయకులు తమ ఇళ్లను గోదాములుగా మార్చి ఇష్టానుసారం రైతులను పక్కదోవ పట్టిస్తున్నారని చెప్పారు. ఈ పరిస్థితికి వ్యవసాయ శాఖ మంత్రి, కలెక్టర్, సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కొందరు వ్యవసాయశాఖ అధికారులు, రైల్వే సిబ్బంది, వ్యాపారులు కుమ్మక్కై ఆమదాలవలస రైల్వే గూడ్స్ షెడ్ గోదాముల నుంచి ఎరువులను అక్రమంగా తరలిస్తున్నారని, వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. రైల్వే నిబంధనల ప్రకారం 5–8 గంటల్లో ఖాళీ చేయాల్సిన వ్యాగన్లు, ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసి రాత్రి సమయంలో ఖాళీ చేసి అక్రమ తరలింపు చేపడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారన్నారు. కంపెనీ ప్రతినిధులు, వ్యాపారులు, కొంతమంది అధికారులు కలసి ఈ వ్యవహారం నడుపుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారిపై చర్యలు చేపట్టాలని, అవసరమైతే ఆయనపై విచారణ వేయించాలని కోరారు. జేసీ స్థాయిలో పరిశీలన జరిపి అక్రమ నిల్వలు గుర్తించి మంత్రితో మాట్లాడుకొని చర్యలు చేపట్టకుండా విడిచిపెట్టడం ఎంతవరకు సమంజమన్నారు. ఎరువుల కోసం రైతులతో ఉద్యమం చేపడతామన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచే హిందీ బోధన



సమావేశంలో మాట్లాడుతున్న హిందీమంచ్ ప్రతినిధులు

శ్రీకాకుళం: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుంచే హిందీ భాషా బోధన ప్రవేశపెట్టాలని హిందీ మంచ్ ఉత్తరాంధ్ర కన్వీనర్, హిందీ ప్రచార సభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కోనే శ్రీధర్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని శాంతినికేతన్ జూనియర్ కాలేజీలో హిందీ మంచ్ జిల్లా శాఖ నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ శిక్షణ కళాశాలలను తక్షణమే పునరుద్ధరించాలన్నారు. హిందీ మంచ్ జిల్లా అధ్యక్షుడు కనుగుల సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర లీడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ ఎస్.వి.రమణ మాదిగ, గౌరవాధ్యక్షుడు దొంతం పార్వతీశం, ప్రధాన కార్యదర్శి రొంపివలస రామారావు, జోనల్ శాఖ కోశాధికారి ఎం.వి.మల్లేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి ఎస్.పద్మనాభరాజు, విశ్రాంత హెచ్ఎం మంగిపుడి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ అప్పలరాజు, తెరవే అధ్యక్షులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఆర్.ఉదయభాస్కర్, శ్రీనివాస్, విశ్రాంత డీఈవో బలివాడ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని నిర్వీర్యం చేయడం శోచనీయం



మాట్లాడుతున్న బాసూరి కృష్ణమూర్తి

శ్రీకాకుళం అర్బన్: విజయవాడ నడిబొడ్డున ఉన్న ఏపీఎస్ ఆర్టీసీ గవర్నర్‌పేట–1, 2 డిపోలు, పాతబస్టాండ్‌కు సంబంధించిన స్థలాన్ని లులూ షాపింగ్ మాల్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో 137ను తక్షణమే రద్దు చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి అన్నారు. శ్రీకాకుళంలో యూనియన్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుమారు రూ.400 కోట్లు విలువైన స్థలాన్ని షాపింగ్‌మాల్‌కు కట్టబెట్టడం శోచనీయమన్నారు. గతంలో ఇదే ప్రభుత్వ హయాంలోనే 2014లో విజయవాడలో ఆర్టీసీ ట్రైనింగ్ కళాశాల స్థలం 29 ఎకరాలను హెచ్‌ఈఎల్ కంపెనీకి కట్టబెట్టారని, అందుకు బదులుగా ప్రభుత్వం ఇస్తామని చెప్పిన స్థలం ఇప్పటి వరకూ ఒక్క గజం కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. 2017లో ఇదే గవర్నర్‌పేట 1, 2 డిపోలు బఫర్‌జోన్ కాలువ గట్టుపై ఉన్నాయని, ఇంటర్నేషనల్ పార్కుగా అభివృద్ధి చేస్తామని, దీనిని అప్పట్లో ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తే జేఏసీగా ఏర్పడి అడ్డుకున్నట్లు తెలిపారు. దశాబ్దాల చరిత్ర కలిగిన ఆర్టీసీని నిర్వీర్యం చేస్తుండటం బాధాకరమన్నారు. సమావేశంలో ఈయూ రాష్ట్ర కార్యదర్శి పి.నానాజీ, జిల్లా అధ్యక్షుడు జి.త్రినాథ్, జిల్లా కార్యదర్శి కె.దశరథుడు, జిల్లా కోశాధికారి పి.వి.ఆర్.లలితకుమారి, శ్రీకాకుళం 1వ డిపో అధ్యక్ష, కార్యదర్శులు జి.బి.మూర్తి, ఎస్.వి.రమణ, శ్రీకాకుళం 2వ డిపో అధ్యక్ష, కార్యదర్శులు బి.ఆర్.కృష్ణ, కె.బాబూరావు, టెక్కలి డిపో అధ్యక్ష, కార్యదర్శులు కె.బి.రావు, ఎస్ఎంరావు, పలాస డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎ రాజు, ఎ.డి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 23 నుంచి కొత్తమ్మ తల్లి ఉత్సవాలు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: కోటబొమ్మాళిలో సెప్టెంబర్ 23 నుంచి 25 వరకు జరగనున్న కొత్తమ్మతల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. శనివారం ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులు, గ్రామపెద్దలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం వందేళ్లు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో గతం కంటే భిన్నంగా ఉత్సవాలను నిర్వహించాలన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ నెల 17న ఆలయం గాలి గోపురాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, బి.గోవిందరాజులు, బి.రమేష్, వి.విజయలక్ష్మి, వి.కామేశ్వరరావు, దేవదాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన బైక్



శ్రీకాకుళం రూరల్: పాత్రునివలస గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ఓ ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకుపోయింది. స్వల్ప గాయాలతో వాహనచోదకుడు బయటపడ్డాడు. అతివేగమే ఈ ఘటనకు కారణమని తెలుస్తోంది. కాలువలో పడిన బైక్‌ను ప్రొక్లెయిన్ సహాయంతో బయటకు తీసుకొచ్చారు.

వృద్ధుడు ఆత్మహత్య

నరసన్నపేట: లుకలాంలో పిల్ల అప్పలనాయుడు (66) అనే వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడుర. అనారోగ్యంతో పాటు రెండు కాళ్లు పనిచేయక నడవలేకపోతుండటంతో మనస్తాపంతో వారం కిందట చీమల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో శుక్రవారం రాత్రి మరణించాడు. కుమారుడు ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తలసేమియాతో బాలుడి మృతి

టెక్కలి: కోటబొమ్మాళి మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన చిగురువలస రంజిత్ తలసేమియా వ్యాధితో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. కొద్ది రోజులుగా విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మరణించాడు. గత ఏడాది పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన తమ కుమారుడు ఉన్నత స్థాయికి వెళతాడని ఆశించిన తల్లిదండ్రులు సింహాచలం, అనురాధకు తీరని వేదన మిగిలింది. రంజిత్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సారవకోట: అంగూరు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడ గ్రామానికి చెందిన ఎల్.శాంతారావు, సారవకోట మండలం గాతలపేటకు చెందిన లక్ష్మణరావులు ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలతో ఢీ కొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రులను నరసన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



ఊసవానిపేట రైల్వే గేటు తెరిచి ఉన్న సమయంలో వచ్చిన గూడ్స్ రైలు

అమ్మో.. రైలు!

- గేటు తెరిచిన సమయంలో వచ్చిన గూడ్స్‌ట్రైన్
- ఆందోళనకు గురైన వాహనచోదకులు
- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

ఆమదాలవలస : శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ సమీపంలో అలికాం –బత్తిలి రహదారిపై నరసన్నపేట వైపు వెళ్లే రోడ్డులో ఊసవానిపేట గేటు వద్ద శనివారం పెను ప్రమాదం తప్పింది. రైల్వేగేటు తెరిచి ఉన్న సమయంలో ఒక్కసారిగా రైలు రావడంతో వాహనచోదకులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఊసవానిపేట గేటు మూసి వేశారు. ఆ సమయంలో వరుసగా రెండు రైళ్లు రావడంతో ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. రైళ్లు వెళ్లిన అనంతరం గేటు తెరిచేసరికి ట్రాక్ మీదుగా ఇరువైపులా రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఇంతలోనే ఉర్లాం వైపు నుంచి విశాఖపట్నం వైపు గూడ్స్ రైలు వస్తున్నట్లు గేట్‌మెన్‌కు సమాచారం వచ్చింది. అప్పటికే వాహనచోదకులు ట్రాక్‌మీదుగా రాకపోకలు చేస్తుండటంతో గేటు వేయడం వీలు కాలేదు. దీంతో గూడ్స్ రైలు డ్రైవర్ అప్రమత్తమై నెమ్మదిగా ప్రయాణిస్తూ రైలు నిలుపుదల చేశారు. పెను ప్రమాదం తప్పడంతో అప్పటికే ట్రాక్‌పై ఉన్నవారంతా ఊపిరిపీల్చుకున్నారు. గూడ్స్ వస్తున్న సమచారం ముందుగానే తెలుసుకోకపోతే ఎలా అంటూ అక్కడి సిబ్బంది తీరుపై ప్రయాణికులు మండిపడ్డారు. విషయం తెలుసుకున్న ఆమదాలవలస పోలీసులు పరిస్థితిని చక్కదిద్ది రైలు బండికి సిగ్నల్ ఇచ్చి పంపించేశారు.

1116 గాజులు.. 1000 లడ్డూలు





నరసన్నపేటలోని వీరన్నాయుడు కాలనీ సమీపంలో సంతోషిమాత అమ్మవారికి రాఖీ పౌర్ణమి సందర్భంగా 1116 గాజులతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం 1000 లడ్డూలతో నైవేద్యం పెట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, మహిళా భక్తులు పాల్గొన్నారు. –నరసన్నపేట

కాంప్లెక్స్ కిటకిట

శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రయాణికులతో కిటకిటలాడింది. శుక్రవారం వరలక్ష్మీవ్రతం, శనివారం రాఖీపౌర్ణమి, ఆదివారం సెలవు కావడంతో ప్రయాణికుల రాకపోకలు అధికంగా సాగాయి. నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద ప్రయాణికులు బారులు తీరారు. సమయానికి బస్సులు రాకపోవడంతో గంటల తరబడి వేచి చూశారు.

– శ్రీకాకుళం అర్బన్



కాంప్లెక్స్‌లో ప్రయాణికుల రద్దీ





బస్సుల కోసం వేచి ఉంటూ..